ప్రజాశక్తి

బుధవారం 13 మార్చి 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల





ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

రూ.10 వేలు లంచం

తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పుల్లలచెరువు పంచాయతీ కార్యదర్శి ఎం.బాలునాయక్ మంగళవారం రూ.పది వేలు లంచం తీసుకుంటూ.. ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. నెల్లూరు ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ దాడులు చేశారు. పుల్లలచెరువు మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ రామవత్ ధర్మానాయక్ విద్యుత్ పనుల కాంట్రాక్టుకు తీసుకొని 2021లో రూ.రెండు లక్షల పనులు చేయించాడు. ఇందుకుగానూ రావలసిన బిల్లులను 2022లోగా సదరు పంచాయతీ కార్యదర్శి బాలునాయక్ బిల్లు నమోదు చేసి.. డబ్బులు అకౌంట్లో వేశారు. అయితే హఠాత్తుగా 2022 డిసెంబర్ 25న ధర్మానాయక్ మరణించారు. మరో లక్ష రూపాయల బిల్లుల మంజూరు కోసం రెండు సంవత్సరాలుగా ఆయన కుమారులు హరినాయక్, శివాజీ పంచాయతీ కార్యదర్శి బాలునాయక్ చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో ఈ నెల 3న బాలునాయక్ హరినాయక్‌తో ఫోన్లో మాట్లాడుతూ 'నీకు రావాల్సిన లక్ష రూపాయలు బిల్లులు చేయిస్తా.. అందుకుగానూ రూ.20 వేలు నాకు చెల్లించాలి' అని షరతు పెట్టాడు. ఈ నిబంధనలకు ఒప్పుకున్న హరినాయక్ అడ్వాన్సుగా రూ.5 వేలు ఇచ్చాడు. లంచమిచ్చేందుకు ఇష్టంలేని హరినాయక్ ఈ నెల ఏడున ఒంగోలు ఏసీబీ డీఎస్పీని సంప్రదించారు. పూర్తి వివరాలను అందజేశాడు. డీఎస్పీ సూచనల మేరకు.. మంగళవారం నాడు కార్యాలయంలో హరినాయక్ బాలునాయక్‌కు రూ.10 వేలు ఇస్తుండగా.. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని.. కేసు నమోదు చేశారు. ఏసీబీ అధికారులు మాట్లాడుతూ ప్రకాశంలో ఎక్కువగా అవినీతి, ఆరోపణలు ఫిర్యాదులు తమ కార్యాలయానికి వస్తున్నాయన్నారు. అవినీతి అధికారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు.



ఏసీబీకి చిక్కిన బాలునాయక్

ఒంగోలు పార్లమెంట్‌లోనూ

రసవత్తర పోరే.?

- మాగుంట కుమారుడు రాఘవరెడ్డిపై చిత్తూరు నేత చెవిరెడ్డి పోటీ
- తన సామాజిక ఓటు బ్యాంకుపై కూడా మాగుంట వ్యూహాత్మక దృష్టి
- వైసిపి బయటకు నెట్టేసినందున గతంలో ఓటేసిన వాళ్లపైనా ఆశలు..



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

నిన్నటివరకూ ఇద్దరూ వైసిపి నేతలే.. ఐదేళ్లూ పాలకపక్షంలోనే కొనసాగారు. ఇప్పుడు వాళ్లిద్దరూ రాజకీయ శత్రువులుగా ఎన్నికల్లో తలపడనున్నారు. ఇందుకు ఒంగోలు పార్లమెంటు వేదిక కానుంది. వాళ్లే ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కుమారుడు రాఘవరెడ్డి. మరొకరు చిత్తూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి. ఇద్దరూ ఇప్పుడు ఒంగోలు పార్లమెంటు బరిలో గెలుపు కోసం తలపడనున్నారు. ఇద్దరూ పోటీకి సిద్ధమయ్యారు.

ఆత్మగౌరవం లేని చోట ఉండలేనని వైసిపికి రాజీనామా చేసిన మాగుంట శ్రీనివాసులరెడ్డి సోమవారం నాడు కీలక ప్రకటన చేశారు. తెలుగుదేశంలో చేరేందుకు సిద్ధమైనట్లు వెల్లడించారు. తమ కుమారుడు రాఘవరెడ్డిని ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దింపుతున్నట్లు చెప్పారు. తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థిగా ఆయన ఒంగోలు పార్లమెంటులో నిలబడబోతున్నారు. ఇక ఈయనపై చిత్తూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి వైసిపి నుంచి పోటీ చేస్తున్నారు. ఈయన్ను పార్లమెంటు సమన్వయకర్తగా పార్టీ అధిష్టానం ప్రకటించిన సంగతి తెలిసిందే. చెవిరెడ్డి నియామకంపై పార్టీ సీనియర్ నేత బాలినేని మొదట్లో తీవ్రంగా వ్యతిరేకించారు. తర్వాత ఆయన కూడా మెత్తబడ్డారు. పార్టీ తీరుపై తీవ్ర అసంతృప్తితోనే ఉన్నారు. మాగుంటకు టిక్కెట్టు ఇప్పించేందుకు చివరివరకూ గట్టి ప్రయత్నాలు చేశారు. పార్టీ నిర్ణయాన్ని విభేదించి చాలా కాలం జిల్లాకు దూరంగానే గడిపారు. సిఎం జగన్ నిర్ణయంలో మార్పు లేనందున బాలినేని కూడా తన బాణీ మార్చుకున్నారు. ఇళ్లస్థలాల పంపిణీతో సర్దుకుపోవడానికే సిద్ధమయ్యారు. ఆఖరు నిమిషం వరకూ వేచిచూసిన మాగుంట చేసేదేమీ లేక పార్టీకి రాజీనామా చేశారు. కొద్దిరోజులు మౌనంగానే ఉన్నారు. తాజాగా ఆయన తన నిర్ణయాన్ని వెలువరించారు. ఇప్పుడు ఒంగోలు పార్లమెంట్ రసవత్తర పోరుకు వేదిక కానుంది. మాగుంట కుటుంబం ఇక్కడ 30 ఏళ్లకు పైగా రాజకీయాలు చేస్తోంది. 1991 నుంచి ఇప్పటివరకూ పార్లమెంటులో ఈ కుటుంబం నుంచే పోటీలో ఉంటున్నారు. రెండు సార్లు మాత్రమే ఇతరులు గెలిచారు. మిగతా సమయాల్లో మాగుంట సుబ్బరామిరెడ్డి, ఆయన మరణం తర్వాత ఆయన సతీమణి పార్వతమ్మ గెలిచారు. తర్వాత మాగుంట శ్రీనివాసులరెడ్డి ఎంపీగా గెలుస్తూ వచ్చారు. రెండు సార్లు మాత్రం ఓడిపోయారు. ఇప్పుడు తన కుమారుడు రాఘవరెడ్డిని రాజకీయ అరంగేట్రం చేయిస్తున్నారు. ఇప్పుడు జిల్లాలో తన కుటుంబానికి ఉన్న రాజకీయ ప్రాధాన్యతల రీత్యా మరోసారి గెలుపు కోసం పరీక్షకు సిద్ధమవుతున్నారు. మాగుంటకు వాస్తవానికి అన్ని పార్టీల్లోనూ ▶ 2లో

మూతేసిన గ్రానైట్ పరిశ్రమలపై

మళ్లీ విజిలెన్స్ దాడులు

- గతంలో వచ్చిన అధికారులతోనే తనిఖీలు
- యజమానుల్లో ఆందోళన

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

రాష్ట్రప్రభుత్వం గ్రానైట్ పరిశ్రమల పట్ల వ్యవహరిస్తున్న కక్షపూరిత ధోరణికి నిరసనగా ఈ నెల 10 నుండి మార్టూరు గ్రానైట్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు 250 గ్రానైట్ పరిశ్రమలను యజమానులు నిరవధికంగా మూసివేసిన విషయం తెలిసిందే.. దీంతో జీవనోపాధి లేక వివిధ రాష్ట్రాల కార్మికులు 80 శాతం మంది తమ సొంత రాష్ట్రాలకు మూడు రోజులుగా తరలి వెలుతున్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరు, కృష్ణా జిల్లాల నుండి వచ్చిన జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారులు (ఎడిలు) మంగళవారం ముందుగా మార్టూరు సమీపంలోని జొన్నతాళి వద్ద మూసేసి ఉన్న పలు గ్రానైట్ పరిశ్రమలపై దాడులు చేశారు. గతంలో వచ్చిన అధికారులే ఇప్పుడు కూడా తనిఖీలు చేపట్టడం గమనార్హం.

ఈ సంవత్సరం జనవరిలో మైనింగ్ అధికారులు ప్రైవేట్ వ్యక్తులను తీసుకెళ్లి తనిఖీలు నిర్వహించిన తీరు తీవ్ర వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే.. అప్పుడు తనిఖీకి వచ్చిన నెల్లూరు జిల్లా విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.బాలాజీ నాయక్,కష్ణా జిల్లా మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.ప్రతాప్‌రెడ్డి 14 మంది సిబ్బందితో రెండు బృందాలుగా ఏర్పడి పోలీస్ బందోబస్తు నడుమ మంగళవారం గ్రానైట్ పరిశ్రమల్లో తనిఖీలు చేశారు. తమ వద్ద ఉన్న లిస్ట్ ఆధారంగా మార్టూరు ప్రాంతంలోని పలు పరిశ్రమలపై దాడులు నిర్వహించారు. ముందుగా జొన్నతాళి వద్ద ఉన్న కామేపల్లి గ్రానైట్ పరిశ్రమ వద్దకు వెళ్లిన అధికారులు అక్కడ పనిచేస్తున్న సూపర్‌వైజర్ ద్వారా యజమాని కామేపల్లి లక్ష్మీప్రసాద్ అనుమతి తీసుకొని ఫ్యాక్టరీలో తనిఖీలు నిర్వహించారు. సమాచారం అందుకున్న మీడియా అక్కడకు చేరుకోవడంతో అధికారులు తనిఖీలు ముగించి అక్కడి నుండి వెళ్లిపోయారు. దాడులతో గ్రానైట్ పరిశ్రమల యజమానులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.



గ్రానైట్ పరిశ్రమలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఉన్నతాధికారుల ఆదేశాలతోనే దాడులు

ఆర్.ప్రతాప్‌రెడ్డి, కృష్ణా జిల్లా మైనింగ్ ఏడీ

బల్లికురవ, వేమవరం, మార్టూరు పరిసర ప్రాంతాల గ్రానైట్ పరిశ్రమలలో అవకతవకలు జరుగుతున్నాయనే సమాచారంతో ▶ 2లో



ఐద్వా సభ్యత్వం నమోదు చేయిస్తున్న రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

బిజెపి ప్రభుత్వ విధానాల వల్లే..

ఉపాధి సమస్య తీవ్రం

▶ 8లో

ఆ పోస్టుల భర్తీ ఆపండి

- గ్రంథాలయంలో బ్యాక్‌లాగ్ పోస్టులపై కలెక్టర్‌కు ఫోన్ చేసి చెప్పిన బాలినేని
- ఆర్డర్లు ఇవ్వని వాటిని నిలిపేస్తామన్న కలెక్టర్

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

గ్రంథాలయ సంస్థలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీని వెంటనే నిలిపేయాలని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కలెక్టర్ దినేష్‌కుమార్‌కు మంగళ వారం నాడు ఫోన్ చేసి చెప్పారు. 'అమ్మకానికి బ్యాక్‌లాగ్ పోస్టులు' శీర్షికన 'ప్రజాశక్తి'లో మంగళవారం వచ్చిన కథనాన్ని కొందరు నిరు ద్యోగులు, పార్టీ నేతలు మంగళవారం ఉద యం బాలినేని దృష్టికి తీసుకుపోయారు. అక్కడ జరుగుతున్న బాగోతాలను వివరించారు. భర్తీ ప్రక్రియ పారదర్శకంగా లేదని ఫిర్యాదు చేశారు. 'ప్రజాశక్తి' పత్రికను ఆయనకు చూపించారు. కథనాన్ని పరిశీలిం చిన బాలినేని వెంటనే కలెక్టర్‌కు ఫోన్ చేసి.. పోస్టుల భర్తీ ప్రక్రియ ను నిలిపేయాలని కోరారు. కలెక్టర్ కూడా అందుకు వెంటనే స్పంది స్తూ ప్రస్తుతం రెండు పోస్టులకు ఆర్డర్లు ఇవ్వడం జరిగిందని.. మిగతా వాటిని నిలిపేస్తామన్నారు.

పారదర్శకంగానే భర్తీ ప్రక్రియ

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ పారదర్శకంగానే చేపట్టినట్లు జిల్లా గ్రంథాలయ ▶ 2లో

రసవత్తర పోరే.?

(మొదటిపేజీ తరువాయి)

సౌమ్యుడుగా పేరుంది. కాంగ్రెస్ నుంచి గెలిచినప్పుడు గానీ, వైసిపి నుంచి గెలిచినప్పుడు గానీ ఆయన కోసం పార్టీ వర్గాలు పట్టుదలతోనే పనిచేశాయి. నేతలు కూడా ఆయనపైనా, వారి కుటుంబంపైనా అభిమానంతోనే ఉన్నారు. ఎందుకంటే చాలా మంది నేతలు మాగుంట గొడుగు కిందనే పెరిగి పెద్దవాళ్లయ్యారు. మాజీ మంత్రి బాలినేనితో పాటు పలువురు నేతలు మాగుంట శిబిరం నుంచే రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారనే చెప్పాలి. వాస్తవం కూడా.. అందుకే బాలినేని చివరివరకూ మాగుంట కుటుంబంపై అభిమానంతోనే అధిష్టానంపై పోరాడారు. ఇటు తెలుగుదేశం అధినేత చంద్రబాబుతోనూ మాగుంటకు మంచి సంబంధాలున్నాయి. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం నుంచి ఎంపీగా ఓడిపోయినా తర్వాత ఆయన గౌరవం తగ్గకుండా ఎమ్మెల్సీ ఇచ్చారు. ప్రస్తుతం ఎంపీగా ఉన్న ఆయనకు వైసిపి టిక్కెట్టు ఇవ్వడానికి నిరాకరించింది. ఇదే వైసిపి నేతల్లోనూ చర్చగా మారింది. మండలాల్లో ద్వితీయ శ్రేణి నేతలు కూడా ఈ విషయంపై అసంతృప్తిగానే ఉన్నారు. చాలాకాలంగా ఉన్న రాజకీయ సంబంధాలు ఈ ప్రభావం చూపాయి. ఇవన్నీ మాగుంటకు ఈ ఎన్నికల్లో కలిసివచ్చే అంశాలుగా కనిపిస్తున్నాయి. వైసిపిలో ఇప్పటివరకూ మాగుంట నుంచి ఏదోరకంగా సాయం పొందిన నేతలు కూడా ఈసారి సహకరిస్తారనే అంచనా ఉంది. గతంలో ఓటేసిన వాళ్లు కూడా మాగుంటకు కాదనలేరనే చర్చ సాగుతోంది. ఏదేమైనా మాగుంటకు వైసిపి షాక్ ఇచ్చినా జిల్లా నేతలు, ఓటర్ల నుంచి ఆదరణ ఉంటుందనే అంచనాల్లో ఆ శిబిరం కనిపిస్తోంది. ప్రత్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఇక్కడకు వచ్చిన తీరు కూడా కొంత మాగుంటకు సానుకూలతను పెంచుతుందని భావిస్తున్నారు. కేవలం ఆర్థిక అంశం తప్ప వైసిపి అభ్యర్థి చెవిరెడ్డికి ఇక్కడ రాజకీయాలతో ఏ మాత్రం సంబంధం లేదు. అధిష్టానం మనిషిగా ఆయన ఇక్కడకు వచ్చారనే చర్చ పాలకపక్షంలోనే సాగుతోంది. పైగా బాలినేని ససేమిరా అంటున్నా పట్టించుకోకుండా బలవంతంగా పంపారనే చర్చ ఇప్పటికీ పార్టీలో సాగుతోంది. ఇవన్నీ ఎలా పనిచేస్తాయనేదీ చూడాలి. పైగా జిల్లా నేతలతో ఆయనకు సన్నిహిత సంబంధాలు కూడా లేవు. పార్టీ పంపినందున ఆయన ఇక్కడకు బదిలీపై అధికారి వచ్చినట్లు వచ్చారు. పార్టీని చూసి ఓటేయడం తప్ప అభ్యర్థిగా ఆయనకంటూ ప్రత్యేక ముద్ర ఏమీలేదనే చెప్పాలి. పైగా ఆయనపై ఇటీవల వెలువడిన కరపత్రాలు కూడా పార్టీలో ఆయన పరిస్థితికి అద్దం పడుతున్నాయి. నేతల సహకారంపైనా సందిగ్ధం కొనసాగుతోంది. వైసిపి అభ్యర్థి అన్న ఒక్క ఎజెండాతో బరిలోకి దిగుతున్నారు. అదేమిటో చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు కేవలం డబ్బు ఒక్కటే సరిపోతుందా? అనేదీ చర్చ సాగుతోంది. ఇలా ఒంగోలు పార్లమెంటులో సీనియర్ రాజకీయ కుటుంబంపై అధిష్టానం తన మనిషిగా భావించిన ఎమ్మెల్యేను అభ్యర్థిగా దింపుతోంది. దీంతో ఇప్పుడు అందరి దృష్టీ ఒంగోలు పార్లమెంటుపైనే ఉంది.

మళ్లీ విజిలెన్స్ దాడులు

(మొదటిపేజీ తరువాయి)

మైన్స్ అండ్ జియాలజీ రాష్ట్ర డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నాం. పరిశ్రమలు మూసివేసి ఉన్నప్పటికీ సంబంధిత యజమానుల అంగీకారంతోనే తనిఖీలు చేస్తున్నాం. తమకు ఎవరిపైనా వ్యక్తిగత ద్వేషాలు లేవు. అధికారుల ఆదేశాలు పాటించడమే మా విధి.

ఆ పోస్టుల భర్తీ ఆపండి

(మొదటిపేజీ తరువాయి)

సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి వెల్లడించారు. 'ప్రజాశక్తి' కథనానికి ఆమె స్పందించి వివరణ ఇచ్చారు. పోస్టులకు అనుమతి ఇచ్చిన మేరకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందన్నారు. మొదటిసారి, రెండోసారి వచ్చిన అర్జీలన్నింటినీ పరిశీలించి ప్రపోజల్ లిస్టును తయారుచేసి.. వెబ్‌సైట్‌లో పెట్టామన్నారు. వీటిపై వచ్చిన ఫిర్యాదులను కూడా పరిశీలించినట్లు తెలిపారు. సర్టిఫికెట్ల మార్కులకు సంబంధించి అధికారులను అడిగామన్నారు. వారి నుంచి వచ్చిన నివేదికల ఆధారంగానే తుది జాబితాను తయారు చేసి కలెక్టర్ ఉత్తర్వుల మేరకు, డైరెక్టర్ అనుమతితో లైబ్రేరియన్ పోస్టులు మూడు సెలక్టు చేయడం జరిగిందని వెల్లడించారు. ఎక్కడా అమ్మకాలు గానీ, అక్రమాలు గానీ జరగలేదని పేర్కొన్నారు.

ఐద్వా జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-సంతనూతలపాడు



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఐద్వా నాయకులు

ఐద్వా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని మంగమూరులో ఐద్వా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా మండల అధ్యక్షురాలు బంకా పద్మ మాట్లాడుతూ మహిళలందరూ తమ హక్కుల కోసం నిరంతరం పోరాడాలన్నారు. ఈ సందర్భంగా సంఘం సీనియర్ నాయకురాలు అబ్బూరి బసవమ్మ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో షేక్ నాగూర్ బి, అన్నాబత్తిన రమణమ్మ, బి ఆదిలక్ష్మి, ఎస్‌కె సుజాత, ఎం అంజమ్మ, కె పద్మ తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

ఐద్వా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన సంతనూతలపాడులో మంగళవారం ఐద్వా జెండాను సంఘం మండల కార్యదర్శి నెరుసుల మాలతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కుంచాల బుజ్జి, వి రేవతి, టి అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో రాస్తారోకో

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల



రాస్తారోకో చేస్తున్న ప్రజలు

గత నాలుగు రోజులుగా నీటి సరఫరా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందిగా మారిందని పెద్ద దోర్నాల లోని పీర్ల చావిడి ఏరియా ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక ఆ వీధివారంతా పెద్ద దోర్నాలలోని పోలీస్ స్టేషన్ జాతీయ రహదారిపై ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. గత నాలుగు రోజులుగా నీటి సరఫరా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సర్పంచ్ చిత్తూరి హారిక, ఎస్ఐ అంకమ్మరావులు అక్కడకు చేరుకున్నారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రాస్తోరోకోను విరమించారు. ఈ కార్యక్రమంలో పీర్ల చావిడి ఏరియా ప్రజలు పాల్గొన్నారు.

ఇష్టకామేశ్వరి చెంచుగూడెంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గల ఇష్టకామేశ్వరి చెంచు గూడెంలో పాలుట్ల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ పి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జ్వర పీడితులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అవసరమైన రోగులకు సెలైన్‌లు ఎక్కించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మాధవీలత, జ్యోతిరాణి, నలగాటి వెంకట్రామయ్య నాయుడు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు 'కోమాలిక'..

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



కోమాలిక

జాతీయ స్థాయి సీనియర్ మహిళ హాకీ పోటీలకు గుడిపూడి వారిపాలెంకి చెందిన అల్లాడి కోమాలిక ఎంపికైంది. సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 8 నుండి 10 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల హాకీ పోటీలలో అల్లాడి కోమాలిక పాల్గొని ప్రతిభకనపరిచి ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికైంది.. ఈ జట్టు మహారాష్ట్ర పూణే లో ఈనెల 13 నుంచి 23 వరకు జరిగే 14వ జాతీయస్థాయి సీనియర్ మహిళ హాకీ టోర్నమెంట్‌లో రాష్ట్ర జట్టు తరపున అల్లాడి కోమాలిక పాల్గొంటుందని హాకీ ప్రకాశం కార్యదర్శి ఏ. సుందర్ రామిరెడ్డి తెలిపారు.

సార్డ్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని వీరభద్రాపురం పంచాయితీ పరిధిలో గల పోతురాజుపెంట చెంచుగూడెంలో సార్డ్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వెంకటాద్రిపాలెం ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ కోటా నాయక్, డాక్టర్ నాయబ్ రసూల్ రోగులకు పరీక్షలు నిర్వహించారు. గర్భిణీలకు ప్రత్యేక చికిత్సలు అందించారు. ఐరన్ మాత్రలు, న్యూట్రిషియన్ టానిక్‌లు అందజేశారు. సాధారణ జ్వరాలకు కూడా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో ప్రాజెక్టు మేనేజర్ మారుతీక్రిష్ణ, ఏపిఎం మరియబాబు, భాగ్యమ్మ, మహాలక్ష్మి, చిన్నబాడు, అంకయ్య, వెంకటమ్మ, వైద్య సిబ్బంది మల్లిక, రమణమ్మ, శ్రావణి, లక్ష్మిదేవి, బయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

ఎపిఈడబ్ల్యుఐడిసి ఛైర్మన్ యనమల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మన బడి నాడు- నేడు ప్రకాశం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టిందని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక వసతుల సదుపాయాల కల్పన సంస్థ ఛైర్మన్ (ఎపిఈడబ్ల్యుఐడిసి) యనమల నాగార్జున యాదవ్ తెలిపారు. నాడు-నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన ఉన్నతమైన మార్పులను, అదనంగా నిర్మించిన తరగతి గదులు, నిర్వహిస్తున్న డిజిటల్ క్లాస్ రూమ్స్‌లను పరిశీలించేందుకు ఆయన మంగళవారం జిల్లాకు వచ్చారు. జిల్లాలోని ముండ్లమూరు ఏపీ మోడల్ పాఠశాల, గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఒంగోలు పట్టణంలోని బండ్లమిట్ట బాలికల ఉన్నత పాఠశాల, సింగరాయకొండ ఏఆర్‌సి అండ్ జివిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను నాగార్జున యాదవ్, ఎపిఈడబ్ల్యుఐడిసి బందం సందర్శించారు. ఏపీ ఈడబ్ల్యుఐడిసి బందం సందర్శించారు. పర్యటనలో ఏపిఈడబ్ల్యుఐడిసి ఈఈ భాస్కర్ బాబు, డిఈ విశ్వనాథం, ఏఈ జగన్, రామ్మోహనరావు, విద్యా శాఖాధికారులు పాల్గొన్నారు.

పొగాకు ధర రూ.231

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోనున్న ఒంగోలు 1వ పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం కొణిజేడు గ్రామరైతులు 595 పొగాకు బేళ్లను తీసుకొచ్చారు. వాటిలో 505 బేళ్ల కొనుగోళ్లు జరిగాయి. వివిధ కారణాలతో 90 బేళ్లను తిరస్కరించారు. అత్యధిక ధర కిలో రూ.231 పలుకగా అత్యల్ప ధర రూ.230 పలికింది. సరాసరి కిలో ధర రూ.227.44 రూపాయలు పలికింది. వేలంలో 20 కంపెనీలు పాల్గొన్నాయి.

CHANGE OF NAME

I, No.**JC 673050L** Rank:Sub Name: **SUBBAIAH GIDDALURI,** residing at 5-12- 90/A, Satya Naranayana Nagar, 5th Ward, Giddalur Tehsil, Prakasam District, Andhra Pradesh State, Pin 523 357 do hereby solemnly affirm I have changed my Son name from **G PRAVEEN** to **GIDDALUR PRAVEEN** affidavit dated 12-03-2024 sworn before Advocate and Notary,Giddalur, Prakasam District, A.P.

CHANGE OF NAME

I, No.**JC 673050L** Rank:Sub Name: **SUBBAIAH GIDDALURI,** residing at 5-12- 90/A, Satya Naranayana Nagar, 5th Ward, Giddalur Tehsil, Prakasam District, Andhra Pradesh State, Pin 523 357 do hereby solemnly affirm I have changed my daughter name from **G ANUSHA** to **GIDDALUR ANUSHA** affidavit dated 12-03-2024 sworn before Advocate and Notary,Giddalur, Prakasam District, A.P.

CHANGE OF NAME

I, **PATTI BADARI TIRU NARAYAN** (Old Name), S/o.**Patti Venkateswarlu** (Late), resident at Door No.14-1-41, Ganta Palem, Opp.Thyagaraja Mandiram, Ongole, Prakasam Dist, Andhra Pradesh - 523001. Have changed my name from **PATTI BADARI TIRUNARAYAN,** (Old Name) to **PATTI BADARI TIRUNARAYANA** (New Name) for all further purpose, vide affidavit was before public notary dated 13-02-2024.

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A.No. 630 / 2023

A.S.No. /2023

మెడబలిమి వెంకటయ్య
మరియు వగైరాలు - పిటిషనర్స్

Vs

కేతు వెంకటరామిరెడ్డి
మరియు వగైరాలు - రెస్పాండెంట్స్

To,
R1.**కేతు వెంకటరామిరెడ్డి,** తండ్రి **వెంకటేశ్వర్లు,**
R/o చింతలపాలెం గ్రామం, పామూరు మండలం, ప్రకాశం జిల్లా.

అయ్యా !

పై నెంబరు పిటిషన్ నందు పిటిషనర్స్ నీ మీద పిటిషన్‌ను దాఖలు చేసియుండుట వలన మీరు స్వతహాగాగానీ, మీ నుంచి సంపూర్ణముగా సంజాయిషీ పొందిన లాయర్ ద్వారా గానీ సదరు పిటిషన్ ప్రత్యుత్తరములు చెప్పగలందులకు **తే14-03-2024 దిన** వాయిదా వేయబడి యున్నది. కావున పై తేదీన **ఉదయం గం॥10.30 నిమిషములకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీ సంజాయిషీని వ్రాతమూలకంగా తెలుపుకొనవలసినదిగా మిమ్ముల్ని ఆదేశించడమైనది. పై తేదీ యందు మీరు హాజరు కాకుండా తప్పినయెడల మీ పరోక్షమందు పై పిటిషన్‌ను తీర్మానించెదరు.

వాయిదా : 14-03-2024

(పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
శ్రీ పెన్నా కృష్ణయ్య,
శ్రీ నాదెళ్ళ యల్లమంద రావు
పిటిషనర్స్ తరపు అడ్వకేట్స్,
కందుకూరు - 523105
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

నోటీసు

అండర్ ఆర్డర్ 21 రూల్ 54 సి.పి.సి.
మహారాజశ్రీ రేపల్లె సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి దివ్యసముఖమునకు

ఇ.పి.నెం.3/2023

ఇన్

ఒ.యస్.నెం.128/2018

బిట్వీన్
తలశిల సాంబశివరావు .....డి.హెచ్.ఆర్.

ఎదిరి

తలశిల మాధవరావు ..... జె.డి.ఆర్.

జె.డి.ఆర్:-
తలశిల మాధవరావు, S/o శివరామకృష్ణయ్య,
డోర్ నెం.7-10ఎ, కన్నెగంటివారిపాలెం,
భట్టిప్రోలు మండలం, గుంటూరు జిల్లా.
(ప్రస్తుతం: బాపట్ల జిల్లా), రేపల్లె జెసిజెసి.

పై నెంబరు అమలు పిటీషన్లో డిక్రీ హెూల్డరు మీపైన 02-06-2019వ తేదీన పొందిన డిక్రీనిబట్టి సదరు డిక్రీ బాకీ వసూలు చేసుకొను నిమిత్తం మీతాలూకు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని జప్తు చేయించవలసినగా పై నెంబరు అమలు దరఖాస్తు దాఖలు చేయగా సదరు విషయమై మీకు కోర్టు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను సి.పి.సి. ఆర్డర్ 21 రూల్ 54 ప్రకారం అనేక పర్యాయములు నోటీసులు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున, మీకు నోటీసు నిమిత్తం .27-03-2024వ తేదీన వాయిదా అయియున్న. ఆరోజు మీరు స్వయముగా గాని, వకీలుగారి ద్వారాగాని పై కోర్టువారి ఎదుట ఉదయం గం.10.30ని.లకు హాజరై ఆక్షేపణలు తెలియజేయని యెడలమీ పరోక్షమున విచారించి తీర్మానము చేయబడునని తెలియజేయడమైనది.

షెడ్యూల్:

గుంటూరు డి.రేపల్లె సబ్ డి.యిలాకా ఓలేరు గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన ఓలేరు గ్రామ సర్వే నెం.340/5 రులో య.1-53ట్లు శేరీ మాగాణీ భూమికి హద్దులు :
తూర్పు : వడ్లమూడి గంగారావుగారు విక్రయించిన భూమి హద్దు
దక్షిణం : గుమ్మడపు చెల్లమ్మగారి వారసుల భూమి హద్దు
పడమర : యార్లగడ్డ రాము వగైరాల భూమి హద్దు
ఉత్తరం : యార్లగడ్డ చుక్కమ్మగారి భూమి హద్దు
యీ హద్దుల మధ్య య.1-53 ట్లు శేరీ మాగాణీ భూమి మాత్రం.

డి. హెచ్.ఆర్. విలువ: రు.9,00,000/-

// శ్రీయుత కోర్టువారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా 27-03-2024

టి.కె.వి.గుప్త,
డి. హెచ్.ఆర్. తరుపు న్యాయవాది,
రేపల్లె.

వేర్వేరు ప్రమాదాల్లో..

నలుగురికి తీవ్ర గాయాలు

ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రాంగ్ రూట్ లో ఎదురుగా వస్తున్న బైకులను తప్పించబోయి వేర్వేరు ఘటనల్లో రెండు బైకులు అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో నలుగురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మార్టూరు సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. ఎన్‌హెచ్ అంబులెన్సు సిబ్బంది ప్రేమ్ చంద్, సుధీర్,చైతన్య కథనం ప్రకారం... విజయవాడ, మంగళగిరి పట్టణాలకు చెందిన భాగ్యరాజు, జగదీష్, పవన్, నవీన్ మరి కొంతమంది కలిసి ఒంగోలు జరిగిన ఓ కార్యక్రమానికి డెకరేషన్ పని నిమిత్తం వచ్చారు. పని పూర్తి కావడంతో బైకులపై స్వగ్రామాలకు బయలు దేరారు. భాగ్యరాజు, జగదీష్ అనే వారు ఓ బైకుకు వెళ్తున్నారు. అదే సమయంలో వారికి ఎదురుగా రాంగ్ రూట్ లో ఓ బైకు వస్తుంది. దాన్ని తప్పించే క్రమంలో బైకు అదుపు డివైడర్‌ను ఢీకొంది. దీంతో జగదీష్, భాగ్యరాజు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వారి వద్ద ఉన్న ఫోన్ ద్వారా విజయవాడలోని బంధువులకు సమాచారం అందించారు. క్షతగ్రాతులతో పాటు పనికి వచ్చిన పవన్, నవీన్ స్కూటీ పై వెళ్తున్నారు. ముందు వెళు తున్న తమ మిత్రుల ప్రమాదం గురించి వారికి తెలియదు. ఈ క్రమంలో వారి స్కూటీ మార్టూరు దాటి రాజుపాలెం సమీపంలోకి వచ్చేసరికి మరో బైక్ అతి వేగంగా వీరికి ఎదురుగా వచ్చింది. దీంతో స్కూటీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో స్కూటీపై ప్రయాణిస్తున్న పవన్,నవీన్ తీవ్ర గాయాలయ్యాయి. తొలి ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు వైద్యశాలలో ఉండగానే తిరిగి మరో ఇద్దరు యువకులు అదే విధంగా ప్రమాదానికి గురవ్వడంతో సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది రెండో ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను స్థానిక వైద్యశాలకు తరలించారు. అనంతరం క్షతగాత్రులను గుంటూరు సర్వజనసమగ్ర వైద్యశాలకు తరలించారు.వారిలో మంగళగిరికి చెందిన జగదీష్, పవన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వేర్వేరు ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన జగదీష్, నవీన్



గాయపడిన నవీన్, భాగ్య రాజు



గాయపడిన శ్రీనివాసరావు

బైకును ఢీకొన్న లారీ.. దంపతులకు గాయాలు

ప్రజాశక్తి-అద్దంకి

బైకును లారీ ఢీకొన్న ఘటనలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. కోరిశపాడు మండలం అనమాలమూరు గ్రామానికి చెందిన ఎ.శ్రీనివాసరావు, నాగేంద్ర దంపతులు బైకుపై అద్దంకి వస్తున్నారు. ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోకి వచ్చేసరికి మేదరమెట్ల వైపు నుంచి శింగరకొండ వైపు వెళ్తున్న లారీ బైకును ఢీకొంది. దీంతో దంపతులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -కనిగిరి

ఈనెల 15న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను క్షకిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి కె. భరత్ చంద్ర తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో లోక్ అదాలత్‌పై పోలీస్ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కక్షిదారులకు రాజీ మార్గమే రాజమార్గమని తెలిపారు. కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకొనేలా చూడాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు న్యాయశాఖ కషి చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే లోక్ అదాలత్‌ను నిర్వహించి కేసులను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జడ్జి భరత్ చంద్ర

సిఎం మహిళల పక్షపాతి : మంత్రి

ప్రజాశక్తి- మద్దిపాడు

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి అని మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. మండల కేంద్రమైన మద్దిపాడులో చేయూత నాలుగో విడత చెక్కులు మంగళ వారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ 45 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు నాలుగు విడతలగా చేయూత పథకం ద్వారా ప్రభుత్వం చెక్కులు అందజేస్తునన‌ట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వాక అరుణ కోటిరెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు అప్పారావు, వివిధ గ్రామాల నాయకులు, సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న మంత్రి నాగార్జున

రజకుల అభ్యున్నతికి ఐక్యంగా కృషి

ప్రజాశక్తి- కనిగిరి

రజకుల అభ్యున్నతికి ఐక్యంగా కషి చేయాలని రజక సంక్షేమ సంఘం కనిగిరి నియోజకవర్గ సలహాదారులు, హెడ్ కానిస్టేబుల్ శెట్టిపల్లి కొండయ్య తెలిపారు. మండలపరిధిలోని ఎన్.గొల్లపల్లిలో విద్యా వికాసం సామాజిక చైతన్యం సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు కొండయ్యను ఘనంగా సత్కరించారు. అనంతరం కొండయ్య మాట్లాడుతూ రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. రజకులు చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించేలా రాజకీయ పార్టీలు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. రజక కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి రజకుల అభ్యున్నతికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

ఎస్‌సి వర్గీకరణ చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహయ్య మాదిగ కోరారు. ఎస్‌సి వర్గీకరణకు చట్టభద్రత కల్పించాలని కోరుతూ ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎస్ ప్లాజాలో మాదిగల ఆత్మీయ సమావేశం మంగళవారం నిర్వహించారు. తొలుత తహశీల్దారు కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ అంశాన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల అజెండాగా మార్చుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు దుగ్గిపోగు నాగరాజు, పానుగంటి సాలెం రాజు , నాయకులు నేదరుపల్లి జయరాజ్, మత్తయ్య, గుర్రం రాణి, జయమ్మ, కత్తి శోభారాణి , భూదాల ఆనంద్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం : ఎంపిడిఓ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిపి కట్టా శోభారాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి జడ్‌పిటిసి, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు యన్నాబత్తిన అరుణ ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో విద్యాశాఖ, వైద్యశాఖ, తాగునీటి సమస్యలు, వ్యవసాయశాఖ, హౌసింగ్, ఐసిడిఎస్, పశువైద్య, మత్స్యశాఖ, హార్టికల్చర్, ఉపాధి హామీ, విద్యుత్ శాఖల పనితీరుపై సమీక్షించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగానికి సంబంధించి బోర్లకు మరమ్మతులు చేపట్టాలని సభ్యులు కోరారు. స్పందించిన ఎంపిడిఓ నగేష్ కుమారి మాట్లాడుతూ వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

వైసిపితో వడ్డెర్లకు అన్యాయం : దేవెండ్ల

ప్రజాశక్తి-సిఎస్.పురం

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం వడ్డెర్లకు తీవ్ర అన్యాయం చేసిందని ఆ సంఘం నాయకులు, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి దేవెండ్ల తిరుపతయ్య తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో వడ్డెర సంఘం సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వడ్డెర్లను ఎస్‌టి జాబితాలో చేరుస్తామని ఓ కమిటీని వేసినట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం ఆ ఊసే ఎత్తలేదన్నారు. ఈ కార్యక్రమంలో బి.వెంకటాద్రి, నాగిశెట్టి, పెనమాల కొండయ్య, నడిపయ్య, బి.వెంకటరామయ్య, పెదవెంకటేష్, పుల్లయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవెండ్ల తిరుపతయ్య

ఇవిఎంలపై అవగాహన

ప్రజాశక్తి-కొండపి

కొండపి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు ఇవిఎంల వినియోగంపై అవగాహన కల్పించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, విజిలెన్స్-1 అధికారి ఎ.కుమార్ తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సెక్టారు అధికారులు, తహశీల్దార్లతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల ఎంత మంది ఉన్నారు, అందులో ఎస్‌సిలు, ఎస్‌టిలు, బిసిలు, ఒబిసిలు, మైనార్టీలు ఎంతో మంది ఉన్నారో గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి బి.కిరణ్‌కుమార్, సెక్టార్ అధికారులు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు .

సిఎస్.పురం : ఇవిఎంల వినియోగంపై ఓటర్లకు ఎన్నికల సెక్టార్ అధికారి రాజాల కొండారెడ్డి అవగాహన కల్పించారు. మండల పరిధిలోని కొత్తపల్లి, అంబవరం, రేగుల చెలుక, చెన్నపునాయనపల్లి, అయ్యలూరివారిపల్లి గ్రామాల్లో ఓటర్లకు అవగాహన కల్పించారు. అదేవిధంగా డీజీ పేట, వెంకటాయచెరువు, పెల్లి బోయమడుగుల, కొండబోయినపల్లి గ్రామాల్లో సెక్టార్ అధికారి ఆర్.శ్రీనివాసులు, శీలంవారిపల్లి, హానికలపల్లి, నల్లమడుగుల, ఉప్పలపాడు గ్రామాల ఓటర్లకు సెక్టార్ అధికారి జి.సంజీవి ఇవిఎంల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి నివాళి

ప్రజాశక్తి-కొండపి

అంబేద్కర్ ఆశయాలను ఆచరిస్తున్న వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే, ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డే నని మంత్రి ఆదిమూలపు సురేష్ తనయుడు ఆదిమూలపు విశాల్ తెలిపారు. మండల పరిధిలోని పెరిదేపి గ్రామంలోనున్న అంబేద్కర్ విగ్రహానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో విశాల్ మాట్లాడుతూ వైసిపి పేదలు, మహిళలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. బడుగుబలహీన వర్గాల వారి అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో కొండపి నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగురవేయాల్సిన అవసరముందన్నారు. అందుకోసం అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పోషణ పక్వాడా కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

ఘనంగా 'పోషణ పక్వాడా'

ప్రజాశక్తి-వేటపాలెం

పోషణ పక్వాడా కార్యక్రమం మంగళవారం వేటపాలెం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని దేశాయిపేట సెక్టార్‌లో గల ఆమోదగిరి పట్నం బుర్రయ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ ఏ బ్యూలా మాట్లాడుతూ పోషక ఆహారం తీసుకుని మహిళలు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని అన్నారు. అందులో భాగంగా తల్లులకు ముగ్గుల పోటీలను నిర్వహించి, తదుపరి రాగి, జొన్న, సజ్జ పిండిలతో దోశలు, బూరెలు, రొట్టెలు మొదలగునవి తయారుచేసే విధానాన్ని తల్లులకు చూపించారు. సూపర్‌వైజర్ ఎస్ లీలావతి, అంగన్వాడీ కార్యకర్తలు ఎన్ పూర్ణిమ, ఎమ్ పద్మ, బి వరలక్ష్మి, టి లక్ష్మి సుజాత, డి శారద, జి నాగలక్ష్మి పాల్గొన్నారు.



పది ప్రశ్నపత్రాలను తరలిస్తున్న విద్యాశాఖ అధికారులు

పోలీస్ స్టేషన్లకు చేరిన పది ప్రశ్నాపత్రాలు

ప్రజాశక్తి-బాపట్ల

ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు సెట్-1 ప్రశ్న పత్రాలు, ఇతర పరీక్షల సామగ్రిని మంగళవారం జిల్లా కేంద్రమైన బాపట్ల నుంచి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె నారాయణరావు తెలిపారు. జిల్లాలో మొత్తం 13 రూట్లలో 108 పరీక్షా కేంద్రాలకు సంబంధించిన ప్రశ్న పత్రాలను భద్రతా సిబ్బంది సహకారంతో తరలించినట్లు డీఈవో తెలిపారు. ప్రశ్న పత్రాల తరలింపు కార్యక్రమాన్ని అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డి ప్రసాదరావు, ఉప విద్యాశాఖ అధికారులు, రూట్ ఆఫీసర్లు, మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు.



ఆక్వా ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎంఎం కొండయ్య

ఆక్వా రైతులకు ఎంఎం కొండయ్య పరామర్శ

ప్రజాశక్తి-చిన్నగంజాం

టిడిపి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దులూరి మాలకొండయ్య ఆక్వా రైతుల ఆహ్వానం మేరకు చిన్నగంజాంలో ఆక్వా సాగును మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా రైతులకు గిట్టుబాటు ధరలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సబ్సిడీని పునరుద్ధరించాలని, ఫీడ్‌కు వాడే ముడి సరుకుల ధరలు నియంత్రించాలని, తద్వారా ఫీడ్ తక్కువ ధరలకు అందించాలని, అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యాన్ని కలగజేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అధునాతన యంత్రాలతో ఆక్వాఫీడ్ మిల్లులు నెలకొల్పి అంతర్జాతీయ మార్కెట్ చేసుకొనేందుకు అవకాశం కల్పించాలని, గిట్టుబాటు ధరలు అందేటట్లుగా రానున్న తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేస్తే ఆక్వా రైతులకు ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. రైతుల సాదకబాదకాలు చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళతానని, రైతు ప్రయోజనాలే ధ్యేయంగా చంద్రబాబు కృషి చేస్తారని తెలిపారు.

'జీరో' ఖాతాలు

- అవి పని చేయడం లేదని.. మార్చుకోవాలని బ్యాంకుల హుకుం
- దొడ్డిదారిన మార్చి వేస్తున్న బ్యాంకు అధికారులు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

జీరో బ్యాలెన్స్ ఖాతాలు, జన్‌ధన్ యోజన ఖాతాలు అంటూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీరో బ్యాలెన్స్ ఖాతాలను బ్యాంకులు దొడ్డి దారిన మామూలు ఖాతాలుగా మార్చి వేస్తున్నాయి. నిరుపేదల కోసం కేంద్ర ప్రభుత్వం ఎటువంటి బ్యాలెన్స్ లేకుండానే కనీస మొత్తాలు పొదుపు చేసుకోవాలని సంకల్పంతో ఎంతో అట్టహాసంగా ప్రారంభించగా వాటిని బ్యాంకులవారు ఏదో ఒక కారణం చెప్పి వాటిని మామూలు ఖాతాలుగా మార్చి వేస్తున్నారని పలువురు ఖాతాదారులు చెబుతున్నారు. వాటిలో కనీస పరిమితి లేకపోవడం, సాధారణ సేవింగ్స్ అకౌంట్‌ల మాదిరిగానే ప్రారంభించడంతో అధిక శాతం నిరుపేదలు ఈ అకౌంట్‌లను ప్రారంభించారు. పాత నోట్ల రద్దు సమయంలో నిరుపేద ప్రజలకు ఎంతగానో ఈ అకౌంట్లో ఉపయోగపడ్డాయి. అదేవిధంగా కరోనా విపత్తు సమయంలో ప్రతి ఖాతాలో



గుళ్లాపల్లి యూనియన్ బ్యాంక్ శాఖ కార్యాలయం

500 రూపాయలు చొప్పున మూడు నెలల పాటు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా నగదు జమ చేసింది.

మెరుగైన ఆదాయం పొందిన బ్యాంకులు

నోట్ల రద్దు సమయంలో జరిగిన జీరో ఖాతాల ఓపెనింగ్ వలన పలు బ్యాంకులు కోట్ల రూపాయల డిపాజిట్లను సేకరించుకోగలిగాయి. ఇప్పటికీ జీరో ఖాతాల ద్వారా ఫిక్స్‌డ్ డిపాజిట్‌ల రూపేణా బ్యాంకులకు జమవుతున్నాయి.

సాధారణ ఖాతాలోకి మారుస్తున్న బ్యాంకులు

అయితే రానురాను నగదు లావాదేవీలు పెరగడంతో బ్యాంకులవారు జీరో ఖాతాలను రద్దు చేయాలని, సాధారణ ఎకౌంట్‌లాగా మార్చాలని ఏదో ఒక కారణం చెప్పి బ్యాంకులు జీరో బ్యాలెన్స్ ఖాతాలను రద్దు చేస్తున్నాయి. ఇప్పటికీ సాధారణ ప్రజలు బ్యాంకులకు వెళ్లినప్పుడు జీరో ఖాతాలు మార్చివేయాలని, వీటిని ఉంచడం లేదని చెప్పి పలు బ్యాంకులు అడ్డదారులలో జీరో ఖాతాలను రద్దు చేస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు లేకపోయినప్పటికీ బ్యాంకుల వారు మాత్రం తమ పని తాము చేసుకుంటున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు చొరవచూపి జీరో ఖాతాలను యథావిధిగా కొనసాగించి వాటికి అదనపు ప్రయోజనాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

రేపల్లె రైల్వేస్టేషన్‌కు ఆధునిక హంగులు

- ఆధునికీకరణకు రూ.25.6 కోట్లు
- వర్చువల్ విధానంలో పనులు ప్రారంభించిన ప్రధాని మోదీ
- శిలాఫలకాన్ని ఆవిష్కరించిన రాజ్యసభ సభ్యులు మోపిదేవి



అభివృద్ధి పనుల శంకుస్థాపనలో పాల్గొన్న మోపిదేవి వెంకటరమణారావు

ప్రజాశక్తి-రేపల్లె

అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకంలో భాగంగా రేపల్లె రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు రూ.25.6 కోట్ల నిధులు మంజూరయినట్లు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు తెలిపారు. మంగళవారం రేపల్లె రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఒక స్టేషన్.. ఒక ఉత్పత్తి కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోపిదేవి వెంకట రమణ రావు మాట్లాడుతూ అమృత భారత్ పథకంలో భాగంగా, రేపల్లె రైల్వే స్టేషన్ ఆధునికీకరణ, అభివృద్ధి, రైలు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టటం అభినందనీయమని అన్నారు. ఈ పథకం ద్వారా గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని రేపల్లె, పిడుగురాళ్ల, దొనకొండ స్టేషన్ల రూపురేఖలు మారనున్నట్లు చెప్పారు. ప్రపంచ స్థాయి ఆధునిక సౌకర్యాలు ప్రయాణికు లకు అందుబాటులోకి రానున్నాయని వివరించారు. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని తీర ప్రాంత చివరి రైల్వే స్టేషన్ రేపల్లె అభివృద్ధికి నిధులు ఏర్పాటు చెయ్యటం హర్షణీయమని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతులు చేసే స్థాయి రేపల్లెకు ఉందన్నారు. ఆక్వా, మెరైన్ ఉత్పత్తులలో కాకినాడ, విశాఖపట్నం తరువాత స్థానం నిజాంపట్నంకు చెందుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మచిలీపట్నం నుంచి బాపట్లకు నూతన రైలు మార్గం నిర్మిస్తే ఈ ప్రాంతం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. అనంతరం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు, గుంటూరు అడిషనల్ రైల్వే మేనేజర్ సైమన్, చైర్ పర్సన్ కట్టా మంగ,, వైసీపీ రేపలె నియోజకవర్గ సమన్వయకర్త ఈవూరి గణేష్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంతో మహిళలకు అవస్థలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మద్యం దుకాణాలను అంచెలంచెలుగా ఎత్తివేస్తామని హామీనిచ్చి, వాటిని పూర్తిగా ప్రభుత్వ దుకాణాలుగా మార్పు చేయటమే కాక ఇంటింటికీ మద్యం ఏరులైపారే విధంగా చర్యలు చేపట్టారు. ఎక్కడో ఊరు బయట ఉండాల్సిన మద్యం దుకాణాలు పూర్తిగా గ్రామం మధ్యలోకి వెలిశాయి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ దుకాణాలు గ్రామం మధ్యలోనే కొనసాగుతుడటంతో ప్రజలకు తీవ్ర ఆటంకంగా మారాయి. భట్టిప్రోలులో గల ప్రభుత్వ మద్యం దుకాణం సాక్షాత్తూ స్టేట్ బ్యాంకు సమీపంలోని పాఠశాల వద్ద, నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి మార్గంలో ఉంది. ఈ మద్యం దుకాణం కారణంగా నిత్యం బ్యాంకుకు, పలు గ్రామాల నుంచి వివిధ రకాల పనులపై భట్టిప్రోలుకు వచ్చేవారికి తీవ్ర ఆటంకంగా మారింది. ప్రధాన రహదారి పక్కనే ఉండటం వలన మద్యం బాబులు షాపులో మద్యం కొనుగోలు చేసి ప్రధాన రహదారి వెంటే మందు సేవించి అక్కడే రహదారిపై పడిపోయి సేదదీరుతూ ఉంటారు. అంతేకాక ఈ మద్యం దుకాణానికి వచ్చే మద్యం బాబులు వారి వారి వాహనాలను రహదారి పక్కన నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు కూడా పెరిగిపోతున్నాయి. ప్రధాన రహదారిలో ఉన్న ఈ మద్యం దుకాణాన్ని గ్రామం వెలుపలకు తరలించాలని అనేకమార్లు గ్రామస్తులు సంబంధిత అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు

మద్యం కొనుగోలు చేసినవారు దానిని దూరంగా తీసుకువెళ్లి వినియోగించుకోవాల్సి ఉండగా అక్కడికక్కడే దుకాణం వద్దనే మద్యం సేవించి బయటకు రావడంతో తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రధాన రహదారి నుంచి సుమారు 20 మీటర్ల దూరంలో ఉన్న దుకాణంలో కొనుగోలు చేసి మద్యం సేవించి రహదారి పక్కనే ఖాళీ సీసాలు, గ్లాసులు వంటి వ్యర్థాలను వేయటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. అంతేకాక దుకాణానికి బయట రహదారి వెంట బెల్ట్ షాప్ కూడా నిత్యం కొనసాగుతుంది. సెలవు దినాలలో, మద్యం దుకాణం తెరిసే సమయాలకు ముందు పదానంతరం ఈ బెల్ట్ షాపులో విక్రయాలు జోరుగా కొనసాగుతుంటాయి. ఈ ప్రాంతంలో ఒక సమయం అంటూ లేకుండానే నిత్యం మద్యం అందుబాటులో ఉంటోంది. ఈ బెల్ట్ షాపు బ్యాంకు పక్కనే ఉండటంతో బ్యాంకులోనికి వెళ్లే మహిళలు, వినియోగదారులకు నిత్యం మందుబాబులు అడ్డొస్తూనే ఉంటారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం 6 గంటలు దాటితే 10 గంటల వరకు ఈ రహదారిపై వాహనాలు గంటలకొద్దీ నిలబడి పోతాయి. ఆ సమయంలో మందుబాబులు అధిక మొత్తంలో మద్యాన్ని కొనుగోలు చేసి రహదారిపైనే సేవిస్తూ ఉండటం వాహనాలను నిలుపుదల చేయటం ప్రధాన ట్రాఫిక్కుకు అంతరాయంగా మారుతోంది. దీనిపై పోలీసులు కూడా తగిన చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఈ ప్రాంతంలో మద్యం బాబుల ఆగడాలు మరింత పెరిగే అవకాశం ఉందని, సంబంధిత ఎక్సైజ్ అధికారులు, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు మద్యం దుకాణంతో ప్రజలకు పొంచి ఉన్న ఇబ్బందుల దృష్ట్యా తగిన చర్యలు చేపట్టాలని కోరుచున్నారు.



భట్టిప్రోలులో ప్రభుత్వ మద్యం దుకాణం

దళితుల మధ్య చిచ్చుపెట్టేందుకు కుట్ర

- కూటమి వలలో పడొద్దు

- మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఎన్నికల నేపథ్యంలో బిజెపి, టిడిపి జనసేన కూటమిగా ఏర్పడి దళితుల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, వారి మాటలు విని దళితులు మోస పోవద్దని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున తెలిపారు. స్థానిక గంజి వారి కళ్యాణ మండపంలో కొండపి నియోజకవర్గ స్థాయి దళితుల సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ కొండేపి నియోజకవర్గంలో దళితుల మధ్య టిడిపి చిచ్చు పెట్టడం ప్రారంభించినట్లు తెలిపారు. వైసిపిలో ఉన్న దళితులు ఆ చిచ్చులో పడవద్దని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత దళితుల స్థితిగతులు మెరుగుపడ్డాయన్నారు. చదువు, ఇల్లు అందరికీ వచ్చినట్లు తెలిపారు. పేదల ఆరోగ్యంపై ఎక్కువ శ్రద్ధ తీసుకుంటున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డే నని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో దళితులపై విపరీతంగా దాడులు జరిగాయన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితుల జీవితాలు మెరుగుపడ్డాయన్నారు.



మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

కొండేపి నియోజకవర్గంలో మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం టిడిపి చేస్తుందన్నారు. ఆ చిచ్చులో వైసిపి కార్యకర్తలు ఎవరూ పడకుండా పనిచేయాలన్నారు. రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి, వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ కొండపి నియోజకవర్గంలో దళితుల మధ్య కోట గోడలు కడుతున్నారని ఆ గోడలపై చర్చించడానికి దళిత సమ్మేళనం. అంబేద్కర్ ఆలోచన విధానాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. బిజెపి అంబేద్కర్ రాజ్యాంగాన్ని మార్చే ఆలోచనలో ఉందన్నారు. తొలుత డాక్టర్ అంబేద్కర్, బాబు జగజీవన్ రామ్, వైఎస్. రాజశేఖర్ రెడ్డి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొప్పోలు ఏడుకొండలు, చుక్కా కిరణ్ కుమార్ , ఎంపిపి కొండబత్తిన మాధవరావు, జడ్‌పిటిసి మన్నెం అరుణ , వినోద్ కుమార్, ఆగిపోగు దత్తు , అశోక్ పాల్గొన్నారు.

మంత్రి నాగార్జున రాకపై చర్చ

శింగరాయకొండ నిర్వహించిన కొండపి నియోజకవర్గ స్థాయి దళిత ఆత్మీయ సమ్మేళానికి వైసిపి సంతనూతలపాడు నియోజక వర్గ ఇన్‌ఛార్జి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున రావడంపై వైసిపిలో చర్చ సాగింది. కొండపి నియోజకవర్గంలో మరోసారి మార్పులు ఉంటాయేమోనని ఆలోచన వైసిపిలో మొదలైంది. గతంలో ఇక్కడ పనిచేసిన జూపూడి ప్రభాకర్ రావు, డాక్టర్ మాదాసి వెంకయ్య , వరికూటి అశోక్ బాబును ఈ కార్యక్రమానికి ఆహ్వానించలేదు. వారిని ఆహ్వానించక పోవడంపై కూడా చర్చ సాగింది. ఈ కార్యక్రమానికి పొన్నలూరు ఎంపిపి మాత్రమే వచ్చారు. మిగతా మండలాల ఎంపిపిలు, జడ్‌పిటిసిలు, సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు హాజరు కాకపోవడంపై చర్చ నడిచింది.

'ఎబిఎం ఆస్తులను చట్ట ప్రకారమే కొనుగోలు చేశా'

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలో కొందరు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రముఖ వ్యాపారవేత్త నాదెళ్ల సుబ్రమణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎబిఎం ఆస్తులను తాను అక్రమంగా ఆక్రమించినట్లుగా, కొనుగోలు చేసినట్లుగా ప్రచారం చేస్తున్నారన్నారు. ఆ ప్రచారం అవాస్తవమన్నారు. చట్ట ప్రకారమే ఎబిఎం ఆస్తులను 1996-97 సంవత్సరంలో కొనుగోలు చేశానన్నారు. ఎవరినీ బెదిరించి, భయపెట్టి అక్రమంగా ఎబిఎం ఆస్తులను కొనుగోలు చేయలేదన్నారు. కావలికి చెందిన పిఎ బీసీ ద్వారా మాత్రమే కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి అన్ని డాక్యుమెంట్లు కోర్టు తీర్పులు తన వద్ద ఉన్నాయన్నారు. ఇటీవల కాలంలో కొంతమంది తనను బ్లాక్ మెయిల్ చేస్తున్నట్లు తెలిపారు. వారు కోరినంత డబ్బు ఇవ్వకపోవడంతో తాను ఏబీఎం ఆస్తులను అక్రమంగా ఆక్రమించినట్లుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు.తనపై తప్పుడు చేస్తే వారిపై నేను సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటానన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్.పద్మజ ఆధ్వర్యంలో తొలుత సరస్వతీ పూజ నిర్వహించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం సర్పంచి వల్లూరు రాజ్యలక్ష్మి, వైసిపి నాయకుడు గాలి బుజ్జిని, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ చిమటా సుధాకర్, గతంలో ఇక్కడ పని చేసిన ఉపాధ్యాయులు అవ్వారు సాంబశివరావు, మాల్యాద్రి, పద్మశ్రీ, ప్రభాకర్‌ను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో

రాష్ట్ర ప్రభుత్వం విఫలం : ఐద్వా

ప్రజాశక్తి -కనిగిరి

మహిళలకు రక్షణ కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైనదని ఐద్వా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె.బషీరా, కె. లక్ష్మీ ప్రసన్న తెలిపారు. కనిగిరి పట్టణంలోని ఇందిరా కాలనీలో ఐద్వా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న మహిళల హక్కులు అమలు కావడం లేదన్నారు. మహిళలపై రోజురోజుకి అత్యాచారాలు, హత్యలు దాడులు పెరిగిపోతుండడంతో వారికి రక్షణ కొరవడిందన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారటం వల్లే మహిళలపై దాడులు పెరుగు తున్నాయని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఎండమావిగా మిగిలిపోయిందన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

గ్యాస్ ధర భారీగా పెంచి ఎన్నికల నేపథ్యంలో స్వల్పంగా తగ్గించి మహిళలకు మేలు చేస్తున్నామని మోడీ గొప్పలు చెబుతున్నారని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం అమలు కావడం లేదన్నారు. అనంతరం ఐద్వా జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు శాంత కుమారి, రత్నమ్మ, మల్లేశ్వరి, ఎలీషమ్మ, వెంకటమ్మ, లాల్ బి, ఎస్‌కె. షమీమ్, రమణమ్మ, బి.ఆదిలక్ష్మి, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి అంగన్‌వాడీల వినతి

ప్రజాశక్తి-మద్దిపాడు

అంగన్‌వాడీ ఆయాలుగా పనిచేస్తున్న వారికి కార్యకర్తలుగా ప్రమోషన్లు ఇవ్వాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మేరుగ నాగార్జునకు మంగళవారం వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు బంకా సుబ్బారావు మాట్లాడుతూ మద్దిపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని నేలటూరు-1, సంతనూతలపాడు మండలం గుమ్మనంపాడు పంచాయతీ పరిధిలోని బొడ్డపాటివారిపాలెంలో ఆయాలుగా పనిచేస్తున్న డి.ధనలక్ష్మి, జి. గోవిందమ్మకు కార్యకర్తలుగా ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. జీవో 102 ప్రకారం వారికి అర్హత ఉన్న రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో ప్రమోషన్లు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో సిఐటియు నాయకులు ఉబ్బా ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మద్దిపాడు ప్రాజెక్టు నాయకురాలు ధనలక్ష్మి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



మంత్రి కి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

రెండోరోజూ రిలే నిరాహార దీక్షలు

అంగన్‌వాడీ ఆయాలకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజు మంగళవారమూ కొనసాగాయి. ఈ దీక్షలను రైతు సంఘం మండల నాయకుడు కనపర్తి సుబ్బారావు ప్రారంభించి సంఘీభావం తెలిపారు.

ఎంఇఒకు కార్మికుల వినతి

ప్రజాశక్తి-బేస్తవారిపేట

మధ్యాహ్న భోజన పతకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఎంఇఒ రమణారెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు షేక్ అన్వర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నారన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా

భూ బాధితులకు న్యాయం చేయాలి

సబ్ కలెక్టర్‌కు ఎమ్మెల్యే అన్నా రాంబాబు వినతి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మండలం రాయవరం వద్ద నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణం కోసం కొందరు రైతులు భూములు ఇచ్చారని, వారికి రావాల్సిన పరిహారం తక్షణమే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు కోరారు. భూ బాధితులతో కలిసి మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనాను మంగళవారం కలిశారు. పరిహారానికి సంబంధించిన ఫైల్ ఎక్కడ ఆగిందో విచారించాలన్నారు. ప్రభుత్వం పరిహారం ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. దీనిపై సబ్ కలెక్టర్ రాహుల్ మీనా స్పందించారు. పై అధికారులకు విషయాన్ని వివరించారు. త్వరలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసిపి దర్శి నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పోతవరం, తానా, చింతల గ్రామాలలో మంగళవారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసిపి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రతి ఒక్కరు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా వైసిపి అభిమానులు, నాయకులు శాలువాలతో వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కోరే సుబ్బారావు, కోరే రంగసాయిబాబు, ఒంటేరు మల్లికార్జున, వెంకటశివ, వైసిపి మండల అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రానికి మూగచింతల, గుర్రపడియ, నెన్నూరుపాడు గ్రామాలకు చెందిన రైతులు 657 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 592 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 65 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.230, అత్యల్ప ధర రూ.220, సరాసరి ధర కిలో రూ.229.92 పైసలు పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. పొగాకు వేలంలో 19 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.



వైసిపిలో చేరిన వారితో దద్దాల నారాయణ యాదవ్

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-సిఎస్.పురం

సిఎస్‌పురం మండలం పెదరాజుపాలెం పంచాయతీ పరిధిలోని ఎగువపల్లి గ్రామానికి చెందిన కొందరు వైసిపిలో చేరారు. వైసిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణయాదవ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసిపిలో చేరిన వారిలో మానం కొండలరావు, రామిశెట్టి హరికష్ణ, మానం ఆదిశేషగిరి, మానం నాగర్జున తదితరులు ఉన్నారు. వీరు గత నాలుగు రోజుల క్రితం టిడిపి చేరారు. ప్రస్తుతం వైసిపిలో చేరారు. ఈ కారక్రమంలో గ్రామ సర్పంచి పందిళ్ళ నాగమణి ఎల్లయ్య, రామిశెట్టిబాబు, పోకల వెంకటేశ్వర్లు, వైసిపి నాయకులు ధనంకుల పార్థు, సంగిశెట్టి వాసు, తోట రమేష్, ఎస్‌కె.ఖాజా తదిరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండల పరిధిలోని గుంతచెన్నంపల్లి గ్రామంలో 40 కుటుంబాల వారు మంఘలవారం జనసేన పార్టీలో చేరినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు జానపాటి రాజశేఖర్ తెలిపారు. గ్రామానికి చెందిన కొత్త గిరిబాబు, ఉల్లిపాయల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో జనసేన పార్టీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి నాగరాజు సమక్షంలో వారు పార్టీలో చేశారు. వారికి నాగరాజు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పూస శ్రీను, మురళి, రాంబాబు, తోట వెంకటేశ్వర్లు, తోట బాబు, సంగిశెట్టి సాయి, కమతం రవి పాల్గొన్నారు.

316 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొనకనమిట్ల ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ ఎస్‌పి. బాలయ్య కోరారు. మండల పరిధిలోని రేగుమానిపల్లె సచివాలయ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వమించారు. ఈ సందర్భంగా సర్పంచి బోయన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం పేదలను దష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 316 మందికి సాధారణ, కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సాధారణ వైద్యులు సయ్యద్ అబ్దుల్, వహీద్, కంటి వైద్య నిపుణులు పివి.ప్రసాద్, సిహెచ్‌ఒ రత్నమ్మ, పిహెచ్‌ఎన్ శైలజ, సూపర్‌వైజర్లు శ్యామల, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

తిపురాంతకం : త్రిపురాంతకంలోని త్రిపురంతాకేశ్వర స్వామివారి, బాలత్రిపుర సుందరి దేవి అమ్మవారి హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదాయాన్ని లెక్కించారు. స్వామివారి హుండీ ఆదాయం రూ. 7,85, 539, అమ్మవారి హుండీ ఆదాయం రూ. 5,20, 064, అన్నదాన హుండీ ఆదాయం రూ. 71,264 కలిపి మొత్తం రూ. 13లక్షల 76 వేల 867 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇఒ చెన్నకేశవరెడ్డి తెలిపారు

ముగిసిన తిరునాళ్ల

ప్రజాశక్తి-పిసిపల్లి

మండల పరిధిలోని మురుగుమ్మి గ్రామంలో సోమ, మంగళ వారాల్లో పేరంటాలమ్మ తిరునాళ్ల ప్రశాంతంగా ముగిసింది. సోమవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు ప్రజలు భారీ సంఖ్యలో విచ్చేశారు. మంగళవారం మురుగుమ్మి అడవిలోని పేరంటాలమ్మ గుడి వద్ద భక్తులు పొంగళ్లు పెట్టారు.

వైసిపి జెండాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-మార్కాపురం

సంక్షేమం, అభివృద్ధి కోసం మరోసారి సిఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని వైసిపి మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు తెలిపారు. స్థానిక గడియారం స్తంభం సెంటరు వద్ద వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు డాక్టర్ వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైసిపి జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, ఎఎంసి మాజీ చైర్మన్లు గుంటక సుబ్బారెడ్డి, గొలమారి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మెంబర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ, కౌన్సిలర్లు బుశ్శెట్టి నాగేశ్వరరావు, షేక్ చిన్న షెక్షావలి, వైసిపి రాష్ట్ర మహిళా విభాగం సహాయ కార్యదర్శి కంది ప్రమీలారెడ్డి, వైసిపి మహిళా నాయకురాళ్లు దుర్గా, రోజ్ లిడియా, నందిగం సుష్మిత భూషణకుమారి, వైసిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు తడికమళ్ల బాలసుబ్బారావు, వైసిపి ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ కరీంబాషా పాల్గొన్నారు.

పొదిలి : వైసిపి ఆవిర్భావం దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రిపూడిలో ఎంపిపి వాకా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కదిరి భాస్కరరావు, నాయకులు ఇనుకొల్లు పిచ్చిరెడ్డి, మాచేపల్లి నాగయ్య ,ఇనుకొల్లు సుబ్బారెడ్డి, అలికేపల్లి కోటేశ్వరరావు, ఇనుకొల్లు మాదిరెడ్డి, గంగిరెడ్డి రమణారెడ్డి, కాకునూరి వెంకటేశ్వర్లు, గొంటు వెంకట నరసింహారెడ్డి, బాలసాని చిన్న, పడిదపు వెంకటేశ్వర్లు, నరసింహారావు పాల్గొన్నారు

యర్రగొండపాలెం : స్థానిక కార్యాలయంలో వైసిపి 14వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి తాడిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్‌పిటి చేదూరి విజయభాస్కర్, జడ్‌పి కో అప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్ బాషా ,వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, సర్పంచి రామావత్ అరుణాబాయి, మాజీ ఎంపిపిలు ఆళ్ళ ఆంజనేయులు, దుగ్గెంపూడి వెంకటరెడ్డి , ఎఎంసి వైస్ చైర్మన్ జయరావు పాల్గొన్నారు.



మార్కాపురంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రాంబాబు

దర్శి : వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పి చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసిపి దర్శి నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి జెండాను నిర్వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలన్నీ పేద ప్రజలకు అందాలంటే మళ్లీ వైసిపిని గెలిపించాలన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కె. హరీష్, కార్పొరేషన్ డైరెక్టర్లు డాక్టర్ ఎస్‌ఎం.బాషా, కుమ్మిత అంజిరెడ్డి, స్థానికొమ్ము తిరుపతిరెడ్డి, ఎంపిటిపి జి. సుధారాణి, అచ్చయ్య, ఎఎంసి చైర్మన్ బుజ్జి, వైసిపి నాయకులు కెవి.రెడ్డి, దేవదానం, సుబ్బారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

శింగరాయకొండ : కొండపి నియోజకవర్గంలో వైసిపిని గెలిపిస్తే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మున్సిపల్ మరియు పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. వైసిపి ఆవిర్భావ దినోత్సం సందర్భంగా కందుకూరు రోడ్డు వద్ద వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. అనంతరం వైసిపి కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్ రెడ్డి, యన్నాబత్తిన వెంకటేశ్వరరావు షేక్ పటేల్, ఎస్‌కె. సలీం బాషా, ఎస్‌కె. కరీం, రాపూరి ప్రభావతి, శైలజ, మాదాల శంకర్ , పొన్నలూరు ఎంపిపి కొండా బత్తిన మాధవ, జడ్‌పిటిసి బెజవాడ వెంకటేశ్వర్లు, వైసిపి మండల అధ్యక్షుడు బత్తిన మదన మనోహర్, పుట్టా వెంకట్రావు, వై. మాధవి, బాలకోటి రెడ్డి పాల్గొన్నారు.



శింగరాయకొండలో మాట్లాడుతున్న మంత్రి సురేష్



దర్శిలో జెండా ఆవిష్కరిస్తున్న బూచేపల్లి

తాళ్లూరు : వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని తూర్పు గంగవరంలోని వైసిపి కార్యాలయం ఆ పార్టీ మండల అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, ఎంపిపి తాడికొండ శ్రీనివాసరావు, జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి వైసిపి జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి : ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వైసిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు. వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెక్ పోస్ట్, గార్లపేట రోడ్డు, కొత్తూరు, చింతలపాలెం లోని వైఎస్‌ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైసిపి కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్లు పులి శాంతి, మాణిక్యరావు, ఎంపిపి దంతులూరి ప్రకాశం, జడ్‌పిటిసి మడతల కస్తూరి రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురిచేడు : వైసిపి ఆవిర్భావ దినోత్స వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కురిచేడు మెయిన్ బజార్‌లోఉన్న వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైసిపి జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేశారు. అదేవిధంగా ఎస్‌సి కాలనీలోని వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సుబ్బయ్య, జడ్‌పిటిసి వెంకట నాగిరెడ్డి, మాజీ ఎంపిపి గంధం కోటయ్య, పిచ్చిరెడ్డి, ఊట్ల వెంకటేశ్వర్లు, ఖాశీం షరీఫ్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

శింగరాయకొండ : ఈ నెల 17న మాదిగ అమర వీరుల సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు రావినూతల కోటి మాదిగ తెలిపారు. సంస్మరణ సభకు సంబంధించిన కరపత్రం మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో ఎంఆర్‌పిఎస్ ఉద్యమం ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రేణమాల మాధవ మాదిగ, శింగరాయకొండ మండల అధ్యక్షుడు రావినూతల వెంకటేష్ మాదిగ, మండల కో-కన్వీనర్ సూరపోగు మోజెష్ మాదిగ, మద్దసాని శ్రీహరి యాదవ్, గాలి ప్రకాష్ మాదిగ, సంతోష్, తిమోతి, జాని, అజయ్, శేఖర్, రవి, కిరణ్, కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

14న నిరసనలను జయప్రదం చేయాలి

మార్కాపురం రూరల్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక చర్యలను ఖండిస్తూ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న రైతు ఉద్యమాలకు సంఘీభావంగా ఈనెల 14న కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల సమన్వయ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ కోరారు. స్థానిక పూలసుబ్బయ్య శాంతి సంఘ భవన్‌లో ఎఐటియుసి నియోజక వర్గ స్థాయి కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగం, కార్మిక వర్గంపై ఏకపక్ష దాడులు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు అందే నాసరయ్య, వెంకటరెడ్డి, ఎస్‌కె.ఖాసిం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవీంద్రనాథ్

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-పొన్నలూరు

మండల పరిధిలోని మాలపాడు వద్ద ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు ఈ నెల 12 నుంచి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సుభాషిణి తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, 7వ తరగతిలో 3, 8వ తరగతిలో 2 సీట్లు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపిసి విభాగంలో 40 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

13న ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాల 2024 బ్యాచ్ లో బిటెక్ సివిల్, మెకానికల్, ట్రిపుల్ ఇ, ఆటోమొబైల్ మరియు ఎంబిఎ విభాగంలో ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులకు శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఈనెల 13న ప్రాంగణ ఎంపికలు నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ తెలిఎపారు. ఈ ప్రాంగణ ఎంపికలకు హాజరయ్యే విద్యార్థినీ విద్యార్థులు తమ బయోడేటా, సంబంధిత ధ్రువపత్రాలతో పాటు పాస్ పోర్ట్ సైజ్ ఫొటో హాజరు కావాలన్నారు. 2024 బ్యాచ్ బిటెక్ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జవాబుదారీతనంతో పనిచేస్తున్నాం: మోపిదేవి




రేపల్లెలో జెండా ఆవిష్కరిస్తున్న మోపిదేవి వెంకటరమణారావు, చీరాలలో వైఎస్‌ఆర్‌కు నివాళి అర్పిస్తున్న కార్యకర్తలు

ప్రజాశక్తి-రేపల్లె

ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావు అన్నారు. వైసిపి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ప్రజల కోసమే సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి పేరు గడించారని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం ఆనాటి కాంగ్రెస్ అధిష్టానాన్ని ఎదిరించి ఓదార్పు యాత్రలు, ఆ తర్వాత పాదయాత్రలు చేసి పార్టీని స్థాపించారని అన్నారు. ఎన్నో వడిదుడుకులను ఎదుర్కొని ధైర్యంగా పోరాడి 2019 ఎన్నికల్లో విజయం సాధించి ముఖ్యమంత్రి అయ్యారని, అప్పటి నుంచి పేదల సంక్షేమమే ఆశయంగా పనిచేస్తూ రాష్ట్ర చరిత్రను మార్చిన గొప్ప వ్యక్తిగా ముఖ్యమంత్రి పేరు పొందారని చెప్పారు. సచివాలయ వ్యవస్థతో పరిపాలనను ప్రజల ఇంటి ముందు నిలిపారని అన్నారు. ప్రజలకు జవాబుదారీతనంతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. అధికారం అంటే బాధ్యత, సేవ అని చాటిచెప్పిన నేత వైఎస్ జగన్ అని అన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో మరోసారి జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఆ దిశగా నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, సమన్వయకర్త ఈవూరి గణేష్, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

చీరాల: వైసీపీ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు ఆదేశాల మేరకు వైసిపి ఆవిర్భావ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. 13 వసంతాలు పూర్తి చేసుకుని 14వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా చీరాల గడియార స్తంభం సెంటర్ వద్ద దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం గవర్నమెంట్ హాస్పటల్‌లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, వైసిపి వేటపాలెం అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, వేటపాలెం ఆర్‌బికే చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లీ వైష్ణవి, జిల్లా కార్యదర్శి శిఖా సురేష్, జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు చీమకుర్తి బాలకృష్ణ, పల్లపోలు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు అందే కృష్ణ, యువత అధ్యక్షులు ఆవుల అశోక్, జనరల్ సెక్రటరీ చిలుకోటి శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌ఛారి, కో ఆప్షన్ సభ్యులు, పట్టణ జేసీఎస్ ఇన్‌ఛార్జి కోలా శివ, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, జగనన్న అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి: రాష్ట్ర రాజకీయాలలో సాధారణ ప్రజల ఎజెండాతో సంక్షేమానికి పెద్దపీట వేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాల సాధన కొనసాగింపు కోసమే వైసిపి ఏర్పడిందని వైసిపి అద్దంకి ఇన్‌ఛార్జి పాణ్యం హనిమిరెడ్డి అన్నారు. పార్టీ 14వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక వైసీపీ కార్యాలయంలో జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వైఎస్సార్ కుటుంబానికి వారసుడుగా మాత్రమే కాకుండా ఆయన ఆశయాలను వారసత్వంగా తీసుకొని ఎన్నో రకాల ఆటుపోటులను ఎదుర్కొంటూ, నిర్బంధాలను అధిగమించి గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలోని 85 శాతం కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందించారన్నారు. రాజన్న లక్ష్యాలను చేరుకోవాలంటే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ప్రతి కార్యకర్తా కృషి చేయాలని అన్నారు. అనంతరం స్థానిక చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో కేక్‌ను కట్ చేసి పిల్లలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ అన్ని విభాగాల జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పర్చూరు: వైసీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక బొమ్మల సెంటర్‌లో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. నూతలపాడు గ్రామానికి చెందిన షేక్ అల్లాఉద్దీన్, షేక్ రహంతుల్లా, షేక్ జిందావలి, షేక్ కాలేషావలి, షేక్ రఫీ, షేక్ నాగూర్ వలి, షేక్ ఫరీసా, షేక్ మీరావలి తమ అనుచరులు, సహచరులతో వైసిపీలో చేరారు. యర్రంవారిపాలెం, పర్చూరు నుంచి హర్ష, వెంకటేష్, ఉమా మహేష్, మణికంఠ తమ సహచరులతో వైసిపీలో చేరారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాల, నెహ్రూ వృద్ధాశ్రమంలో వైసిపీ ఇన్‌ఛార్జి యడం బాలాజీ సోదరుడు లక్ష్మి దీపక్ పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. వీరి వెంట కోట శ్రీనివాస్, గాదె సురేష్, నూతలపాడు సర్పంచ్ కాకర్లమూడి చిన్నయ్య పాల్గొన్నారు.




అద్దంకిలో వైఎస్‌ఆర్‌కు నివాళి అర్పిస్తున్న వైసిపి నాయకులు, పర్చూరులో భారీ కేక్ కట్ చేస్తున్న పార్టీ శ్రేణులు



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మోపిదేవి వెంకటరమణారావు

తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి నిధులు

ప్రజాశక్తి-రేపల్లె

రేపల్లె మండల పరిధిలోని తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి 4 కోట్ల 74 లక్షల 39 వేల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసి ప్రారంభించినట్లు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావు తెలిపారు. మండలంలోని పెనుమూడి, చాట్రగడ్డ, నల్లూరి నార్త్ కామరాజు గడ్డ నార్త్, సింగుపాలెం, విశ్వేశ్వరం, చోడయపాలెం, పిరాట్లంక, చెన్నుపల్లి వారిపాలెం, రాజు కాల్వా, మోళ్లగుంట, తుమ్మల, కైతేపల్లి, ఊలుపాలెం, అరవపల్లి, గుడ్డికాయ లంక, గ్రామాలలో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ సంక్షేమం అభివృద్ధి రెండు కళ్ళుగా భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి చేశారని చెప్పారు. పేదలకు నివేశన స్థలాలను శాశ్వత రిజిస్ట్రేషన్ చేసి అందించినట్లు తెలిపారు. గ్రామ సచివాలయ భవనాలు, సిసి రోడ్లు, హెల్త్ సెంటర్లు ఆర్‌బికేలతో పాటు ప్రజల తాగునీటి అవసరాలకు ఓహెచ్‌ఎస్ఆర్ ప్లాంట్లను పైప్‌లైన్ నిర్మాణాలను చేపట్టినట్లు తెలిపారు. సంక్షేమ పథకాలలో కులమత భేదాలు చూడకుండా అర్హత ప్రామాణికంగా అనేక కుటుంబాలకు సాయం అందించినట్లు చెప్పారు. రానున్న 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు నియోజకవర్గం సమన్వయకర్త ఈవురి గణేష్, రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్య బాబు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ గంధం రవీందర్

ఎన్నికల్లో నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-పర్చూరు

ఎన్నికల కమిషన్ ఆదేశం మేరకు ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా పాత్రికేయులకు శిక్షణ, అవగాహన స్థానిక అద్దంకి నాంచారమ్మ కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, బాపట్ల జిల్లా ఆర్‌డిఒ గంధం రవీందర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన దగ్గర నుంచి ధర్మబద్ధం మార్గంలో ఉండాలని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు ప్రెస్‌కు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం పనిచేయాలని, రెచ్చగొట్టే వ్యాఖ్యలు రాతలు చేయకూడదని సూచించారు. ప్రతి ప్రకటనకు అకౌంటు ఉంటుందని, ట్రోలింగులకు కూడా అకౌంట్ ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న అభ్యర్థి రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయకూడదని తెలిపారు. పార్లమెంటుకు పోటీచేసే అభ్యర్థి రూ.90 లక్షలకు మించి ఖర్చు చేయకూడదని అన్నారు. మూడు పూటలా ఫ్లయింగ్ స్క్వాడ్ తిరుగుతూ ఉంటుందని తెలిపారు. అట్లా ఏదైనా కంప్లైంట్ గనక వచ్చినట్టయితే అభ్యర్థిత్వాన్ని కూడా రద్దు చేసే అవకాశం ఉందని తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం మద్యం, డబ్బుల పంపిణీ ప్రోత్సహించకూడదని వివరించారు. కార్యక్రమంలో పర్చూరు, మార్టూరు, యద్దనపూడి, కారంచేడు, చిన్నగంజాం తహాశీల్దార్లు సిహెచ్ సుబ్బయ్య, కే సంధ్యశ్రీ, వై నాగరాజు, మెహర్‌బాబు, ఫణీంద్రబాబు, నియోజకవర్గంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ జిల్లా అధ్యక్షులు పలతోటి ఆంజనేయ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఇంకొల్లులో వివిధ దళిత సంఘాల నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇంకొల్లు మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన పులిపాటి వీరయ్య వద్ద ఇంకొల్లుకు చెందిన బొర్రా శ్రీనివాసరావు అలియాస్ వాసు ఉద్యోగం ఇప్పిస్తానని నాలుగు సంవత్సరాల క్రితం రూ.15 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా, డబ్బులు అడిగితే వాసుతో పాటు, ఆయన తల్లి, భార్య మూకుమ్మడిగా వీరయ్యపై దాడి చేసి కులం పేరుతో దూషించారని ఈనెల 7వ తేదీన ఇంకొల్లు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. దాడికి పాల్పడి కులం పేరుతో దూషించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జై భీమ్‌రావు భారత పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాటుకూరి డేవిడ్ డిమాండ్ చేశారు. సమావేశంలో అంబేద్కర్ దళిత చేనేత సొసైటీ అధ్యక్షులు కాకి కరుణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

15న నిధుల దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు సర్పంచ్ ఏజర్ల ప్రసన్న నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణపై ఈ నెల 15వ తేదీన బాపట్ల జిల్లా గ్రామ పంచాయతీ అధికారి విచారణ చేపట్టనున్నారు. ఉదయం 10 గంటలకు ఇంకొల్లు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో విచారణ ప్రారంభం కానుంది. విచారణకు సర్పంచ్ ఏజర్ల ప్రసన్న, బాధ్యులైన ఉద్యోగులు, వార్డు సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారి నుంచి ఉత్వర్వులు అందాయి.



ముస్లిం మహిళలతో మాట్లాడుతున్న వరికూటి లక్ష్మి

ఎన్నికల ప్రచారంలో వరికూటి లక్ష్మి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

వేమూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు ఓ పక్క ఎన్నికల ప్రచారం చేస్తుండగా మరోపక్క ఆయన సతీమణి లక్ష్మి కూడా తనదైన శైలిలో నియోజకవర్గంలో మహిళామణులను కలుస్తూ పార్టీ ప్రచారాన్ని చేపట్టారు. దీనిలో భాగంగా మంగళవారం భట్టిప్రోలులోని అద్దేపల్లి గ్రామంలో మొగల్ స్ట్రీట్‌లోని ముస్లిం మహిళలను కలిసి ఆమె వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో అశోక్‌బాబును గెలిపించాలని అభ్యర్థించారు. రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ పాలన కొనసాగటానికి ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఎంపీపీ డివి లలిత కుమారి, జడ్పిటిసి టి. ఉదయ్ భాస్కరి, మాజీ జెడ్పిటిసి బండారు కుమారి, ఎంపీటీసీ కవుతరపు పద్మావతి, మండల ఉపాధ్యక్షులు కే పిచ్చయ్య శాస్త్రి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


మహిళల ఆర్థిక సాధికారత దిశగా అడుగులు

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు మండలానికి సంబంధించి 4వ విడతగా వైఎస్ఆర్ చేయూత పథకం కింద 7,105 మంది లబ్ధిదారులకు 13 కోట్ల 32 లక్షల రూపాయలు అర్హులైన అక్క చెల్లెమ్మలకు అందించినట్లు వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. ఎంపీపీ కడప లక్ష్మి, మాజీ ఎంపీపీ కడప వంశీధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, వైస్ చైర్మన్ కతా దీపికా, తహశీల్దారు జి సిద్ధార్థ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఏపీఎం నరేష్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నా కన్నా మెరుగైన నేత ఉంటే

ఆయనకే టిక్కెట్టివ్వండి: కోన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్లలో తన కన్నా మెరుగైన నేత ఉంటే ఆయనకే టికెట్ ఇవ్వాలని సిఎం జగన్‌తో చెప్పానని బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి అన్నారు. మంగళవారం బాపట్ల వైసిపి కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాపట్లలో తాను ఉన్నా, లేకున్నా వైసిపిని తిరుగులేని శక్తిగా తయారు చేస్తానని పదేళ్ల క్రితమే జగన్మోహన్‌రెడ్డికి చెప్పానన్నారు. తనకు టిక్కెట్ ఇస్తేనే పనిచేస్తానని చెప్పలేదన్నారు. గడచిన పదేళ్లలో బాపట్లలో వైసీపీకి పటిష్టమైన పునాదులు వేశానన్నారు. ప్రతి కార్యకర్త కాలర్ ఎగరేసి తాను వైసీపీ కార్యకర్తనని చెప్పుకునేలా బాపట్లలో వైసీపీని అభివద్ధి చేశానన్నారు. మళ్లీ బాపట్ల వైసిపి టిక్కెట్ తనదేనన్నారు. ఈ విషయంలో ఎలాంటి సందేహం లేదన్నారు. రఘుపతికి ఈసారి టిక్కెట్ లేదని కొందరు ప్రచారం చేస్తుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇక్కడ రఘుపతి ప్రదానం కాదని, స్థానికంగా పార్టీ బలోపేతం కావడం ముఖ్యమని పేర్కొన్నారు. పదేళ్లలో ఎంతోమందిని ఎంపీపీలు, జడ్పిటిసిలు, సర్పంచ్‌లు, ఏఎంసీ చైర్మన్లుగా చేశాననే తృప్తి మిగిలిందన్నారు. రానున్న ఐదేళ్లలో బాపట్లను మరింతగా అభివద్ధి చేసుకోగలమనే విషయాన్ని గుర్తించాలన్నారు. సిద్ధం సభకు బాపట్ల నుండి 14 వేల మంది తరలి వెళ్లడం శుభపరిణామమన్నారు. రానున్న ఎన్నికల్లో బాపట్ల ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించి సీఎం జగన్మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దామన్నారు. సమావేశంలో బాపట్ల నియోజకవర్గ పార్టీ పరిశీలకులు రూత్రాణి, ఎంపీపీ చిన్ని పోతుల హరిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎజ్రయ్య, మండల పార్టీ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, చేజర్ల నారాయణరెడ్డి వడ్డీముక్కల డేవిడ్, సయ్యద్ పీర్, గుర్రుముచ్చు పుష్పరాజ్యం, జోగిరాజా, ఏఎంసీ మాజీ చైర్మన్ గవిని కష్ణమూర్తి, ఏఎంసి వైస్ చైర్మన్ పిన్నిబోయిన ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు సంసిద్ధంగా ఉండాలి

కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యే నాటికి నోడల్ అధికారులందరూ తమ తమ విభాగాల విధులను ప్రణాళికాబద్ధంగా రచించుకొని సంసిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా సూచించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఎన్నికల నోడల్ అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమై ఎన్నికలు సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో 16 విభాగాలు తమతమ బాధ్యతలను సంపూర్ణంగా నెరవేర్చి ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు తోడ్పడాలన్నారు. ప్రతి విభాగం వారి విధులకనుగుణంగా ముందస్తు ప్రణాళిక రచించుకొని, అందుకనుగుణంగా కార్యాచరణ తయారుచేసుకోవాలన్నారు. ఎన్నికల్లో ప్రతి విభాగం ముఖ్యమైనదేనన్నారు. ఎవరి విధులు వారు భాద్యతతో నిర్వహించాలన్నారు. ఎన్నికల విధుల్లో అలసత్వం పనికిరాదని, అటువంటి వారు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు రెండు విడతలుగా శిక్షణ తరగతులు నిర్వహించడానికి రిటర్నింగ్ అధికారులతో మాట్లాడి షెడ్యూల్ తయారీకి ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు, వివిధ విభాగాల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికలు

రాష్ట్ర భవిష్యత్తుకు ఎంతో ముఖ్యం

మాజీ ఎమ్మెల్యే దామచర్ల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర భవిష్యత్తుకు రానున్న ఎన్నికలు ఎంతో ముఖ్యమైనవని, ఎన్నికలలో టిడిపి గెలుపు అత్యవసరమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు తెలిపారు. జనం కోసం జనార్ధన్, బాబు షఉరిటీ భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమం మంగళవారం ఒంగోలు నగరంలోని 11వ డివిజన్ క్లౌపేటలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన దామచర్ల జనార్ధన రావు డివిజన్ నాయకులు ఘన స్వాగతం పలికారు, మహిళలు హారతులిచ్చి వారి అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో భాగంగా దామచర్ల జనార్ధనరావు ఇంటింటికి వెళ్లి మహిళలు, యువతతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు, డివిజన్ లో సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందజేసి తెదేపా అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ టిడిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక విజన్ ఉన్న నాయకుడని, రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే ఆయన మళ్లీ సిఎం కావాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో తెదేపా గెలుపు అత్యవసరమని, ఇందుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమం లో మంత్రి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి షేక్ కపిల్ బాషా, బండారు మదన్,11వ డివిజన్ అధ్యక్షులు గంగవరపు సందీప్, పుల్లంశెట్టి మణి, గుర్రాల రాజ్ విమల్, ఎద్దు శశికాంత్ భూషణ్, తెనాలి సింగ్ మాస్టార్, జెన్నీ దివాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జనార్ధన్‌కు స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

బిజెపి ప్రభుత్వ విధానాల వల్లే..

ఉపాధి సమస్య తీవ్రం

- అందుకే మహిళలకు నామమాత్రపు వేతనాలు
- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి-వేటపాలెం

బిజెపి ప్రభుత్వ విధానాలతో దేశంలో ఉపాధి సమస్య తీవ్రమైందని, చేసుకోవడానికి పని లేదని, ఫలితంగానే మహిళలు నామ మాత్రపు వేతనాలకు పనిచేయాల్సి వస్తోందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. మంగళవారం ఐద్వా ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మంగళవారం వేటపాలెం మండలం, దేశాయిపేట పంచాయితీ సిలోన్ కాలనీలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదలు, మహిళల పట్ల వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. ఈ దేశంలో హిందూ విద్వేషాన్ని రెచ్చగొట్టి ఓట్ల రూపంలో లబ్ధి పొందాలనే ప్రక్రియలో భాగంగా మహిళలు సమిధలై పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు నిత్యావసర ధరలు పెంచి పెట్టుబడిదారుల ఆస్తులను పెంచే ప్రక్రియలో సాధారణ మహిళలు రోజువారీ ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోలేకపోతున్నారని పేర్కొన్నారు.



ఒంగోలులో జెండాను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

సువర్ణమాల మృతికి పరిహారం చెల్లించాలి

మండల పరిధిలోని సిలోని కాలనీకి చెందిన ఐద్వా నాయకురాలు సువర్ణమాల మృతికి నష్ట పరిహారం చెల్లించాలని రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పరిస్థితులు, ఆస్తుల అన్యాక్రాంతం, విధ్వంసంపై ప్రశ్నించే నాయకురాలు సువర్ణమాల మతికి అధికార యంత్రాంగం బాధ్యత తీసుకోవాలని అన్నారు. సువర్ణమాల కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సువర్ణమాల కుటుంబసభ్యులకు నష్టపరిహారం అందించే వరకు పోరాడతామని చెప్పారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు సుభాషిణి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఒంగోలు కలెక్టరేట్: స్త్రీ, పురుష సమానత్వం, సమాన హక్కుల సాధన కోసం మహిళలు ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. స్థానిక ఎల్‌బిజి భవన్ వద్ద అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీనియర్ నాయకురాలు వై.అంజనీదేవి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు సయ్యద్ షర్మిళ, జిల్లా నాయకులు జి.ఆదిలక్ష్మి, కె.రాజేశ్వరి, జి.కళ్యాణి, బి.గోవిం దమ్మ యన్.భవాని, బి.నాగరాణి, బి.అనూరాధ కె.గురవమ్మ పాల్గొన్నారు.


సత్కరిస్తున్న ఎస్‌పి వకుల్‌జిందాల్

పోలీసు అధికారులకు ఘన సన్మానం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఇటీవల జరిగిన బదిలీలలో బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్ విశాఖపట్నం క్రైమ్ ఏసిపిగా, బాపట్ల డిఎస్పీ టి.వెంకటేశులు మైదుకూరు డిఎస్పీగా, చీరాల డిఎస్పీ ఎస్.ప్రసాద్‌రావు ఇంటలిజెన్సీ విభాగానికి, బాపట్ల ఎస్.బి ఇన్స్పెక్టర్ వి.సూర్యనారాయణ ప్రకాశం సోషల్ మీడియా విభాగానికి బదిలీపై వెళ్లారు. మంగళవారం జిల్లా పోలీస్ క్యాంప్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎస్పీ వకుల్‌జిందాల్ వీడ్కోలు అభినందన సభ నిర్వహించి.. ఘనంగా సన్మానించారు. సభలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేస్వర్, సెబ్ ఎసి సిహెచ్ మహేష్, చీరాల డిఎస్పీ బి.ప్రసాద్ రావు, రేపల్లె డిఎస్పి టి.మురళీకష్ణ, బాపట్ల డిఎస్పి సిహెచ్.మురళీకష్ణ, డీఎస్పీ క్రైమ్ శ్రీనివాసరావు, ట్రైనీ డిఎస్పి విద్యశ్రీ, ఎస్.బి ఇన్స్పెక్టర్ వి.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు ఆహ్వానం


అంకమ్మరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తొలి తెలుగు దళిత కవితా వైతాళికుడు, మహాకవి కుసుమ ధర్మన్న జయంతోత్సవాల సందర్భంగా ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం, కుసుమ ధర్మన్న కళాపీఠం సంయుక్త నిర్వహణలో ఈ నెల 16న రాజమహేంద్రవరంలో జరిగే జాతీయ తెలుగు సదస్సుకు రిసోర్స్ పర్సన్(సమన్వయ కర్త)గా తనకు ఆహ్వానం అందిందని కళామిత్ర మండలి (తెలుగు లోగిలి) సంస్థ జాతీయ అధ్యక్షులు మరియు ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు ఒక ప్రకటనలో తెలిపారు. కవి సమ్మేళనంతో పాటు కుసుమ ధర్మన్న పేరిట ప్రముఖులకు పురస్కారాల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు.

సిఫార్సు బదిలీలను నిలిపివేయాలి

యుటిఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ఉపాధ్యాయుల సిఫారసు బదిలీలను నిలిపివేయాలని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓవి వీరారెడ్డి, డి.వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసి సాధించుకున్న ఉపాధ్యాయుల బదిలీల కౌన్సిలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ ప్రభుత్వమే తమ విధానాలకు తిలోదకాలిస్తూ ప్రభుత్వ సిఫార్సుల బదిలీల పేరుతో రెండు. జాబితాలు రెండు దఫాలుగా డిఇఒ కార్యాలయానికి వచ్చినట్లుగా సమాచారం ఉందన్నారు. గతంలో ఇదేతరహాలో 80 మంది ఉపాధ్యాయులకు సిఫార్సు బదిలీలు చేపట్టారని, అందులో ఇప్పటికి జీతాలు లేక గత ఆరు నెలలనుండి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఒకవైపు డిఎస్‌సి నోటిఫికేషన ఇచ్చి ఖాళీ పోస్టులను ప్రకటించారని, మరోవైపు రెండు మూడు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుండగా హడావిడిగా పైరవీలతో సిఫారసు బదిలీలను చేపట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. జిల్లాలో నిలిచిపోయిన ఉపాధ్యాయుల పదోన్నతులపై పట్టించుకోకుండా ఆటకెక్కించిన అధికారులు ఈ బదిలీలను ఎలా సిఫార్సు చేస్తారని వారు ప్రశ్నించారు. తక్షణమే సిఫారసు బదిలీలను ఆపి నిలిచిపోయిన ఉపాధ్యాయుల పదోన్నతులను వెంటనే చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

రెండు రోజుల్లో

సెంట్రల్ కంట్రోల్ ఏర్పాటు చేయాలి

అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటుచేస్తున్న సెంట్రల్ కంట్రోల్ రూమ్ ఏర్పాట్లను రెండు రోజుల్లో పూర్తిచేయాలని కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల సంధర్భంగా కలెక్టరేట్ లో ఏర్పాటు చేయనున్న సెంట్రల్ కంట్రోల్ రూమ్ ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం కలెక్టర్ దినేష్ కుమార్, జెసి ఆర్.గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలత లతో కలసి సందర్శించారు. కంట్రోల్ రూమ్‌లో చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి, అందుకు అవసరమయ్యే టివిలు, కంప్యూటర్లు, ప్రింటర్లు, జెరాక్స్, ఇంటర్నెట్, మైక్ సిస్టం, టేబుళ్లు, కుర్చీలు ఇతర సదుపాయాలన్నీ రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా పకడ్బందీగా నిర్వహించడానికి పూర్తి స్థాయిలో మానిటరింగ్ చేసేలా కలెక్టరేట్‌లో సెంట్రల్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో ఎన్నికలకు సంబందించిన ఫిర్యాదులు, టోల్ ఫ్రీ, సోషల్ మీడియా మానిటరింగ్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా వార్తల మానిటరింగ్, ఎంసిసి మానిటరింగ్ వంటి విభాగాలను పర్యవేక్షించేలా పలు శాఖల అధికారులు, సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పోలింగ్ రోజున వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణకు అవసరమగు ఏర్పాట్లతో పాటు ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేంతవరకు పూర్తి స్థాయిలో మోనిటరింగ్ చేసేలా కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షించేలా అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట వివిధ కమిటీలకు సంబంధించిన నోడల్ అధికారులైన జడ్పీ సిఇఒ బి.జాలిరెడ్డి, సిపిఓ డి. వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఎ, మెప్మా, హౌసింగ్, ఐసిడిఎస్ పీడీలు టి.వసుంధర, టి. రవి కుమార్, ఈ.పేరయ్య, కె.మాధురి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ మర్ధన్ ఆలీ, డిటిసి ఆర్.సుశీల, ఆర్టీసి ఆర్ఎం బి. సుధాకర్, ఎన్నికల విభాగపు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.